క్లుప్తంగా

నేడు ఉచిత వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే వైద్యశిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

హోంగార్డుల పూజలు



పూజలు చేస్తున్న హోంగార్డులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో గురువారం పలువురు హోంగార్డులు ప్రత్యేక పూజలు చేశారు. తమ ఉద్యోగాలను సీఎం కేసీఆర్ పర్మినెంట్ చేయాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, బ్లూకోర్ట్, కార్యాలయాల భద్రత, పెట్రోలింగ్‌లో హోంగార్డుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఖానాపూర్: పట్టణంలోని రెంకోనివాగు సమీపంలో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించి మైనింగ్ శాఖకు సమాచారం ఇచ్చినట్లు ఎస్సై పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న శ్రీకాంత్

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన జాదవ్ రాంచందర్ నెల రోజుల కిందట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో తన స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకోగా.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో రాంచందర్ ఫోన్‌ను గుర్తించారు. గురువారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ బాధితుడికి అప్పగించారు. ఫోన్ పోగొట్టుకుంటే భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై నారాయణరెడ్డి ఉన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించాలి

ముధోల్: తమ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసులను లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎస్సైలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

'వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

పెంబి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కిశోర్‌నాయక్ అన్నారు. గురువారం మండలంలోని తాటిగూడ గ్రామంలో తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నీల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భీం, నవీన్, రాజు, శివ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల



కన్కపూర్‌లో మాట్లాడుతున్న మీనా

లోకేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్యకర ఎదుగుదల ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీనా అన్నారు. గురువారం మండలంలోని కన్కపూర్, పోట్‌పల్లి(బి), ఎడ్దూర్ గ్రామాల్లో పోషన్‌అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రేఖాబాయి, నరేశ్, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, చంద్రతాయి, భోజవ్వ పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని అంజనీతండాలో గురువారం సోయా పంటలను ఏఓ జాదవ్ సాయికిరణ్ పరిశీలించారు. ప్రస్తుత వాతావరణం కారణంగానే పంటకు కాండపు ఈగ సోకి పూత, కాత రాలిపోతుందని రైతులకు వివరించారు. దీని నివారణకు ఎకరాకు కొరాజిన్ 60ఎంఎల్, క్లోరిపైరిపాస్ 3.5 ఎంఎల్ లీటర్ నీటికి, లామ్డా సైహలోత్రిన్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఏఓ సూచించారు.



నిర్మల్ కేజీబీవీలో కృష్ణుడు, గోపికల వేషధారణ



కుంటాలలో శ్రీకృష్ణుడి పల్లకి ఊరేగింపులో గ్రామస్తులు



లోకేశ్వరం స్వాధ్యాయ కేంద్రంలో..



ముధోల్‌లో కృష్ణుడు

చిన్నికృష్ణులు.. చిట్టి గోపికలు

జిల్లావ్యాప్తంగా గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో యాదవసంఘం ఆధ్వర్యంలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. గ్రామాల్లోని శ్రీకృష్ణుడి ఆలయాల్లో భక్తుల కోసం అన్నదానం చేశారు. పలు చోట్ల కృష్ణుడి పల్లకిసేవ, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మరోవైపు వేడుకలు తిలకించేందుకు జనం రావడంతో కూడళ్ల వద్ద సందడి నెలకొంది. - సాక్షి, నెట్‌వర్క్



నిర్మల్‌చైన్‌గేట్: గోపిక వేషధారణలో చిన్నారి



కుంటాలలో ఉట్టి కొట్టేందుకు యువకుల పోటీ



భైంసా: శిశుమందిర్ పాఠశాలలో ఉట్టి కార్యక్రమం



తానూరు: మొగ్గిలో కృష్ణుడికి గ్రామస్తుల పూజలు



కుభీర్‌లో యాదవ సంఘం ఆధ్వర్యంలో..



నిర్మల్‌టౌన్: మంజులాపూర్‌లో యాదవుల ఆధ్వర్యంలో



జిల్లా కేంద్రంలోని శిశుమందిర్ పాఠశాలలో..



సోన్: న్యూబొప్పారంలో గ్రామస్తుల పూజలు



తానూరు : భోసి శిశుమందిర్ పాఠశాలలో..



కుభీర్‌లోని కృష్ణుడి మందిరంలో భక్తుల పూజలు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో ఉట్టి కొడుతున్న చిన్నారి

అభివృద్ధిని చూసే బీఆర్‌ఎస్‌లో చేరిక

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దని సూచన

నిర్మల్‌టౌన్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసే బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నిర్మల్‌రూరల్ మండలం న్యూపోచంపాడ్ గ్రామానికి చెందిన 40 మంది, దిలావర్‌పూర్ మండలానికి చెందిన 30 మంది, నర్సాపూర్ మండలానికి చెందిన 30 మంది, లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరారు. జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుల మాటలను ప్రజలు నమ్మొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికీ మేలు చేస్తుందన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని.. నిర్మల్‌లో బీఆర్‌ఎస్ గెలుపు కోసం పని చేయాలని సూచించారు.



పార్టీలో చేరిన నాయకులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

నర్సాపూర్(జి): తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ మండలంలోని ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్టులు గురువారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అనువైన స్థలం సేకరించాలని స్థానిక తహసీల్దార్‌ను ఆదేశించారు.

విద్యుత్ సరఫరా కోసం వినతి..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం గ్రామంలో కోతిదేవుడి ఆలయం, మహా పోచమ్మ ఆలయాలకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని ఆ గ్రామ వీడీసీ సభ్యులు మంత్రికి వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంత్రి ఐకేరెడ్డిని ధర్మారం వీడీసీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు రోజుల్లో అధికారులను పంపి అంచనా వేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ రఘునందన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రాజేశ్వర్, ధర్మారం సర్పంచ్ రాజేందర్, ధర్మన్న తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ

భైంసాటౌన్: ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర చారిత్రాత్మకమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు యాత్ర వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భైంసా ఏరియా స్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు సింధే ఆనందరావు పటేల్, కొమ్రేవార్ కిరణ్‌కుమార్, హైమద్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రొద్దుటూరు సతీశ్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఆలూరు ప్రశాంత్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంజద్‌షేక్, బ్లాక్ ప్రెసిడెంట్ రమేశ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు భూమన్న, నకిడి లక్ష్మణ్, సలీం, భగవాన్‌రావు పటేల్, షేక్ ఈసా, షేక్ మౌలా, మొయిజ్, బారీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంప్రదాయాలను కాపాడుకోవాలి

భైంసాటౌన్:మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని హిందూవాహిని మహిషా(భైంసా) శాఖ సభ్యులు అన్నారు. శ్రీ కృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని బుధవారం రాత్రి భైంసాలోని కిసాన్‌గల్లీ శ్రీసరస్వతి శిశుమందిర్‌లో, ప్రిప్రి కాలనీలోని రాంలీలా మైదానంలో కబడ్డీ, ఉట్టి కొట్టే పోటీలు నిర్వహించారు. కిసాన్‌గల్లీలో నిర్వహించిన పోటీల్లో ఖానాపూర్ జట్టు మొదటిస్థానంలో నిలిచి రూ.20వేల నగదు బహుమతి, ట్రోఫీ గెలుపొందారు. రన్నరప్‌గా నిలిచిన జైశ్రీరాం ముధోల్ జట్టుకు రూ.10వేలు అందించారు. రాంలీలా మైదానంలో జరిగిన పోటీల్లో భైంసాకు చెందిన భగత్‌సింగ్‌యూత్ జట్టు మొదటి బహుమతి గెలుపొందగా (రూ.10వేలు), రన్నరప్‌గా దొడర్న జట్టు (రూ.5వేలు) గెలుపొందారు. విజేతలకు ఎస్సై శ్రీకాంత్ బహుమతి అందించారు. హిందూవాహిని సభ్యులు చింతపండు మహేశ్, కాశీనాథ్, శ్రీనివాస్, చందూలాల్ తదితరులు ఉన్నారు.



బహుమతి ఇస్తున్న హిందూవాహిని సభ్యులు

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

పెంబి: వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని ఖానాపూర్ సీఐ మోహన్ అన్నారు. మండలంలోని లోతర్యతాండ గ్రామంలో గురువారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాల్లేని 26 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సదరు వాహనదారులకు జరిమానాలు విధించి వాహనాలను అప్పగించారు. కార్యక్రమంలో పెంబి, ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు రజనీకాంత్, శంకర్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, పెంబి పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖానాపూర్ సీఐ మోహన్

వాహనాలు తనిఖీ

మామడ: మండలకేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాల్లేని వాహనాలకు జరిమానా విధించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. సాయిబాబాకు మంగళస్నానం, అభిషేకం, గణపతి, గౌరి, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు

కుంటాల: కుంటాలకు చెందిన ప్యాదరి దేవకి-గజ్జారాం దంపతుల కుమారుడు అరవింద్ వికారాబాద్‌లోని నారాయణరావు యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నీట్ ఫలితాల్లో అరవింద్ సత్తా చాటాగా సెకండ్ ఫేజ్‌లో సీటు సాధించాడు. విద్యార్థిని పలువురు సన్మానించారు.

ఇంటి వద్దే వైద్య పరీక్షలు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో జ్వరంతో బాధపడుతున్న పలువురికి గురువారం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటి వద్దనే రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుగుణ, శివకృష్ణ, యాస్మిన్, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు రైల్వేలైన్ మంజూరుపై హర్షం

సోన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లాకు రైల్వేలైన్ మంజూరు చేయడంపై ఆ పార్టీ నాయకులు, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రాంనాథ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్, నిజామాబాద్ మీదుగా హైదరాబాద్ వెళ్లేందుకు 317 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ ఏర్పాటుకు రూ.5,706 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో సరికెల గంగన్న, హరీశ్‌రెడ్డి, మోత్కుపల్లి నరేశ్, అశోక్, నర్సయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావుల రాంనాథ్

వేతనాలు విడుదల చేయాలి

ఖానాపూర్: ఆశ్రమ పాఠశాలలో పని చేసే దినసరి కార్మికుల, పార్ట్‌టైం ఉద్యోగుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయకుంటే కార్మికులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నిర్మల్‌లో 'జోడో యాత్ర' ర్యాలీ

నిర్మల్‌చైన్‌గేట్:కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు ఆదేశాల మేరకు నిర్మల్‌లో ఆ పార్టీ శ్రేణులు గురువారం వేడుకలు నిర్వహించారు. గాంధీపార్క్‌లోని బాపూజీ విగ్రహానికి, మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మినీ ట్యాంక్ బండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, విభజన రాజకీయాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ, చైనా దురాక్రమణలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగించారన్నారు. రాహుల్‌గాంధీ దేశ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జునైద్ మెమన్, నాయకులు అర్జుమాన్ అలీ, నందెడపు చిన్నూ, ఎంబడి రాజేశ్వర్, సబా కలీమ్, మతీన్, రాకేష్, గణేశ్, ప్రతాప్‌రెడ్డి, రాంరెడ్డి, రాజేశ్వర్ గంగాధర్ తదితరులున్నారు.



నిర్మల్‌లో గాంధీ విగ్రహం వద్ద నేతల నినాదాలు

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో బీజేపీ నాయకుడు సుంక మల్లెన్న తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించింది. గురువారం బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావు పటేల్ పరామర్శించారు. బీజేపీ నాయకులు పృథ్వీ, బద్దం గంగారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్ కాలనీకి చెందిన సాగర్‌రెడ్డి, సాయన్న, దశరథ్, అంబారావు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురువారం వీరిని కాలనీలోని కార్యసిద్ధి హనుమాన్ మందిరంలో శాలువాలతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ సన్మానించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీ సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కూన రమేశ్, సాగర్‌రెడ్డి, వంశీధర్, ఎం.శ్రీనివాస్, శరత్ చంద్రారెడ్డి, విజయ్‌కుమార్, నర్సయ్య, బద్రి నర్సయ్య, మహేశ్, శ్రీనివాస్, ఆనంద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



శాలువాతో సన్మానిస్తున్న ఈశ్వర్

9న బాల కవిసమ్మేళనం

భైంసాటౌన్:కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని ఈనెల 9న బాల కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా శాఖ కన్వీనర్ జాదవ్ పుండలిక్‌రావు పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన బాల కవులు పాల్గొనాలని సూచించారు. పట్టణంలోని శ్రీమేధా హైస్కూల్లో ఉదయం11.30 గంటలకు బాల కవి సమ్మేళనం ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9441333315 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి గ్రామసభలు

లోకేశ్వరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ గ్రామసభలను ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తామని.. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈనెల 8న కిష్టాపూర్‌లో గ్రామసభ, 9న మన్మద్, పోట్‌పల్లి, రాయపూర్ కాండ్లీ, గొడిసెర, పుస్పూర్, జోహర్‌పూర్, వట్టోలి, పిప్రి, నగర్, హావర్గ, 10న గడ్‌చాంద, హఢ్‌గాం, 13న లోకేశ్వరం, బిలోలి, కన్కపూర్, అబ్దుల్లాపూర్, పంచగుడి, ధర్మోర, బామ్నికే, రాజూర, బాగాపూర్, సేవాలాల్‌తండా, నర్సింహనగర్‌లో గ్రామసభలను నిర్వహిస్తామని.. ఉపాధి కూలీలు తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

బాధితుడికి సరుకులు పంపిణీ

పెంబి: మండలంలోని వస్పుల పంచాయతీ పరిధిలోని కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ ఇల్లు విద్యుదాఘాతంతో కాలిపోయిన విషయం తెలిసిందే. గురువారం మండల కేంద్రంలో బాధితుడిని మహిళా కమిషన్ సభ్యులు ఈశ్వరీబాయి పరామర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీవో ఆత్రం భాస్కర్‌తో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. బాధితుడికి ఇల్లు కట్టించి ఆదుకోవాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవ వైవిధ్య నిర్వహణ కమిటీ సభ్యులు తిరుపతి, ఉప సర్పంచ్ సహదేవ్, గ్రామస్తులు ఉన్నారు.